తాగునీటికి తంటాలు

- యనమలకుదురులో తాగునీటి కొరత
- బోర్ల ద్వారా అందని తాగునీరు
- తమతోపాటు మున్సిపాలిటీ కూడా కొన్ని ట్యాంకర్లు ఏర్పాటు చేయాలన్న దాతలు
- సహకరించని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



ట్యాంకర్ వద్ద నీటి కోసం నిరీక్షిస్తున్న మహిళలు



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ యనమలకుదురులో తాగునీటికోసం జనం అల్లాడిపోతున్నారు. గుక్కెడు నీరు కావాలని గ్రామస్తులు కోరుతున్నా మున్సిపాలిటీ అధికారులు స్పందించటం లేదు. తాగునీరు లేక పోతే తాము ఎలా బతకాలని మహిళలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

వివరాల్లోకి వెళితే..

యనమలకుదురులో పేద, మధ్య తరగతి కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయి. వీరికి మున్సిపాలిటీ సరఫరా చేసే పబ్లిక్ కొళాయిల నుంచి అప్పుడప్పుడూ తాగు నీరు అందుతుంది. ఈ ప్రాంతంలో శాశ్వతంగా తాగునీరు అందించే చర్యలు తీసుకోలేదు. పేదలు ఉండే ప్రాంతాల్లో ఎక్కడా వాటర్ ట్యాంకులు నిర్మించలేదు. కేవలం డైరెక్టు బోర్‌లతో పైప్ లైన్‌ల ద్వారా కుళాయిలకు నీరు వదులుతున్నారు. కుళాయిల్లో నీరు కూడా అంతంత మాత్రంగా వచ్చేవి. ఈ ప్రాంతంలో దాదాపు ఆరు వేల మంది జనాభా శాశ్వత పరిష్కారం లేక తాగునీటి కోసం తహతహలాడుతున్నారు.

మొరాయిస్తున్న బోర్లు..

గ్రామంలో బందరు కాలువ కట్ట ఇందిరా నగర్- 2, భగత్‌సింగ్‌నగర్, బీసీ కాలనీ, లంబాడీపేట తదితర ప్రాంతాలకు డైరెక్టు బోర్ల ద్వారానే నీరు ఇస్తున్నారు. అయితే ఎండ తీవ్రత పెరగటంతో బోర్లు మొరాయించాయి. భూగర్భ జలాలు తగ్గటంతో బోర్లు పని చేయటం లేదు. కుళాయిల్లో చుక్క నీరు రావటం లేదు. వేసవి ఆరంభంలోనే తాగునీటి సమస్య మొదలైంది. ఇంకా ఎండ తీవ్రత పెరిగితే పేద వర్గాలు దాహంతో అల్లాడిపోయే పరిస్థితి ఉంది. కొందరు దాతలు ముందుకు వచ్చి ట్యాంకర్లతో స్వచ్ఛందంగా నీరు సరఫరా చేస్తున్నారు. అయితే తాడిగడప మున్సిపాలిటీ అధికారులు మాత్రం స్పందించటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ట్యాంకర్లతో కాకుండా కుళాయిల ద్వారానే తాగు నీరు అందించాలని బాధిత ప్రజలు కోరుతున్నా మున్సిపాలిటీ అధికారులు స్పందించటంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

అధికారుల మొండి వైఖరి..

వాస్తవానికి సమస్య ఉన్న ప్రాంతాల్లో మున్సిపాలిటీ ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలి. అయితే తమతోపాటు మున్సిపాలిటీ కూడా కొన్ని ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని దాతలు మున్సిపాలిటీ అధికారులను కోరారు. అధికారులు ససేమిరా అనడంతో దాతలు కూడా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను విరమించుకున్నారు. మున్సిపాలిటీ అధికారులు సహకరించక పోవటంతో ట్యాకర్లతో నీరు అందించలేమని దాతలు వారి సేవలు తాత్కాలికంగా నిలిపారు. దీంతో నీటి సమస్య చాలా తీవ్రంగా మారింది.

మహిళల ఆగ్రహం..

మున్సిపాలిటీ అధికారులపై స్థానిక మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంత మంది జనాభా ఉంటే ఎన్నాళ్లు దాతలు ట్యాంకర్లతో నీరు సరఫరా చేపస్తారని ప్రశ్నిస్తున్నారు. వృద్ధులు, గర్భిణులు, చిన్నారులకు నీరు ఎలా అందుతుందని ప్రశ్నిస్తున్నారు. పండుగ వెళ్లిన తెల్లారే నీటి సరఫరా ఆపారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులకు కనీస బాధ్యత లేదని, నీరు అడిగితే ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటున్నారని బాధితులు అంటున్నారు. మున్సిపాలిటీ అధికారులు కుళాయిల్లో నీరు ఎందుకు ఇవ్వలేక పోతున్నారని, ఓట్ల కోసం వచ్చి అనేక హామీలు ఇచ్చిన నాయకులు ఇప్పుడు పేద ప్రజల సమ స్యలు పరిష్కరించకుండా పోయారని ఆరోపిస్తున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలపై అనేక పన్నులు వేస్తున్నారని, ఇదెక్కడి న్యాయం అని మహిళలు ధ్వజమెత్తుతున్నారు. యనమలకుదురులో ప్రజల తాగునీటి కష్టాలను కూటమి పాలకులే పరిష్కారం చేయాల్సి ఉంది.

అధికారుల నిర్లక్ష్యం కారణంగానే..



తాగునీరు అందించే విషయంలో మున్సిపాలిటీ అధికారులకు నిర్లక్ష్యం తగదు. తమ నీటి కష్టాలు తీర్చడంలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. ఎండా కాలం నీరు లేక పోతే ఎలా ఉంటాము. వెంటనే కుళాయిల్లో నీరు సరఫరా చేయక పోతే ఆందోళన చేపడతాం.

– సరస్వతి, ఇందిరానగర్ , యనమలకుదురు

రూ.కోటి 40 లక్షలతో అభివృద్ధి పనులకు తీర్మానం

ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి



మాట్లాడుతున్న ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి

విజయవాడరూరల్: మండల పరిషత్ సాధారణ నిధులు రూ.కోటి 40 లక్షలతో వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసేందుకు ప్రతిపాదించినట్లు ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం జరిగింది. 2025- 26వ సంవత్సరానికి సబంధించిన మండల పరిషత్ సాధారణ నిధులు 23 శాతం, ఎస్సీ నిధులు 15 శాతం నుంచి అభివృద్ధి పనులకు ఖర్చు చేసేవిధంగా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రసాదంపాడు గ్రామంలో 15 పనులు, రాయనపాడు గ్రామంలో ఒక పని, నిడమానూరు గ్రామంలో 8 పనులు, రామవరప్పాడు గ్రామంలో 5 పనులు, కె.తాడేపల్లి గ్రామంలో 2 అభివృద్ధి పనులు చేసేందుకు ప్రతిపాదించారు. రామవరప్పాడు ఎంపీటీసీ సభ్యురాలు సుగుణ కుమారి మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులు ప్రారంభించేటప్పుడు ఎంపీటీసీ సభ్యులకు ఎలాంటి సమాచారం ఉండటం లేదన్నారు. ప్రసాదంపాడు ఎంపీటీసీ సభ్యుడు దూరు రత్నం మాట్లాడుతూ మండలం నుంచి అభివృద్ధి పనులకు గ్రాంట్లు మంజూరు చేస్తున్నా విలువ ఉండటంలేదని ఆవేదన చెందారు. నిడమానూరు ఎంపీటీసీ సభ్యుడు రసూల్ మాట్లాడుతూ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసే విషయంలో ఎవరు నిర్ణయాలు తీసుకొంటున్నారని ప్రశ్నించారు. సమావేశంలో సభ్యులు అభివృద్ధి పనుల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. అనంతరం పలు గ్రామాల సభ్యులు, సర్పంచ్‌లు అడిగిన మేరకు సుమారు కోటి రూపాయల అదనపు అభివృద్ధి పనులకు సప్లిమెంటరీ ఏజెండాలో సమావేశం ఆమోదం తెలిపింది. ఇక నుంచి ఎంపీటీసీలకు సమాచారం పంపుతామని ఇన్‌చార్జి ఎంపీడీఓ మురళీకృష్ణప్రసాద్ తెలియజేశారు. తహసీల్దార్ బి.సుగుణ మాట్లాడుతూ గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తున్నామన్నారు. జెడ్పీటీసీ కే సువర్ణరాజు, ఎనికేపాడు సర్పంచి పూర్ణచంద్రరావు, ఎంఈవో ఎ.వెంకటరత్నం, ఎంపీవో బి.రంగనాథ్‌బాబు, డీఆర్‌డీఏ ఏపీఎం చంద్రశేఖర్, పలు శాఖలకు సంబంధించిన అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

అకాల వర్షంతో రైతులకు నష్టం



అంబాపురంలో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న దృశ్యం

అంబాపురం(విజయవాడరూరల్): ఆరబెట్టిన ధాన్యం అకాల వర్షం కారణంగా తడిసిపోవడంతో దాళ్వారైతులు నష్టపోయారు. గురువారం మధ్యాహ్నం కురిసిన వర్షాలకు అంబాపురం, పి.నైనవరం, పాతపాడు గ్రామాల్లోని రైతులు తడిసిన ధాన్యాన్ని శుక్రవారం ఆరబెట్టుకొంటున్నారు. వెస్ట్ ఫ్లై ఓవర్ రోడ్డు కింది వైపు ఆరబెట్టుకున్న ధాన్యం తడిసిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆన్‌లైన్లో అమ్మకాలు జరగక పోవడంతో అవి అలంకార ప్రాయంగా ఉన్నాయి. ప్రభుత్వం సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టయితే సమస్యలు ఉండేవి కాదని రైతులు అంటున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మకాలు జరగకపోవడంతో ప్రైవేటు వ్యాపారులు తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. తడిసిన ధాన్యం కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అధికారులకు లోకాయుక్త నోటీసులు

గన్నవరం: స్థానిక మదర్ థెరిస్సా కాలనీలోని విమానాశ్రయం ప్రహరీ పక్కన రెవెన్యూ పోరంబోకు స్థలంలో అక్రమంగా నిర్మించిన భారీ కట్టడాలపై చర్యలు తీసుకోవడంలో అలసత్వం వహిస్తున్న అధికారులకు లోకయుక్త నోటీసులు జారీ చేసింది. వివరాలిలా ఉన్నాయి. కాలనీలోని శ్రీపెద్దమ్మతల్లి ఆలయ నిర్వాహకులు ఎయిర్‌పోర్ట్ గోడ పక్కనే ఉన్న ఆర్‌ఎస్.నం:493లోని స్థలాన్ని ఆక్రమించుకుని తొమ్మిది పోర్షన్‌లు 27 గదులతో భారీ భవనాన్ని నిర్మించారు. గతంలో విమానాశ్రయ సెక్యూరిటీ బఫర్ జోన్‌లో ఉన్న సదరు స్థలాన్ని ఇప్పుడు ఎయిర్‌పోర్ట్ అథారిటీ రిలీజ్ చేయగా రెవెన్యూ శాఖ పరిధిలోకి వచ్చింది. అయితే ఈ అక్రమ కట్టడాన్ని కూల్చివేయాలని మాజీ సైనిక ఉద్యోగి ఎం.రవికుమార్‌తో పాటు పలువురు రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో రవికుమార్ లోకయుక్తను ఆశ్రయించారు. ఈ ఫిర్యాదును స్వీకరించిన లోకయుక్త 394/2025/బీ2 పిటిషన్‌గా రిజిస్టర్ చేసింది. అక్రమ కట్టడంపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించిన గన్నవరం తహసీల్దారు, పంచాయతీ కార్యదర్శి, గుడివాడ ఆర్డీఓ, డీపీఓ, జిల్లా కలెక్టర్‌ను బాధ్యులను చేస్తూ నోటీసులు జారీ చేసింది. ఈ విషయాన్ని ఫిర్యాదుదారుడైన రవికుమార్‌కు శుక్రవారం లోకయుక్త అసిస్టెంట్ రిజిస్ట్రార్ నుంచి వచ్చిన రిజిస్టర్ పోస్టు ద్వారా తెలియజేశారు.

రేపు డైట్, ప్రాణశక్తిపై శిక్షణ

పెనమలూరు: డైట్- ప్రాణశక్తిపై ఒక్క రోజు శిక్షణ ఇస్తామని యోగాశక్తి సాధన సమితి వ్యవస్థాపన చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ అన్నారు. ఆయన శుక్రవారం వివరాలు తెలుపుతూ ఈ నెల 6వ తేదీన ఉదయం 10 గంటలకు కానూరు అశోక్‌నగర్ ఇండియన్ ఓం కార్యాలయంలో శిక్షణ ఉంటుందన్నారు. మానవదేహం నాలుగు తత్వాలు కలిగి ఉంటుందన్నారు. చలువ తత్వం, అతి చలువ తత్వం, వేడి తత్వం, అతి వేడి తత్వం కలిగి ఉంటుందన్నారు. మానవదేహం తత్వాన్ని బట్టి ఆహారం తీసుకుంటే ఆరోగ్య మెరుగుతుందన్నారు. ఈ శిక్షణలో పాల్గొనే వారు 90003 47469 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలపాలన్నారు.

సీపీఎం సీనియర్ నేత చింతపల్లికి నివాళి



బుద్దవరం(గన్నవరం): మండలంలోని బుద్దవరం గ్రామంలో శుక్రవారం వామపక్షాల ఆధ్వర్యంలో సీపీఎం సీనియర్ నేత చింతపల్లి లక్ష్మారాయుడు వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్మారక స్థూపం వద్ద సీపీఎం జిల్లా కార్యదర్శి వైనరసింహారావు, పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో జరిగిన అనేక కమ్యూనిస్టు ఉద్యమాల్లో ఆయన కీలకపాత్ర పోషించారని చెప్పారు. ఆయన ఆశయాల సాధన కోసం వామపక్షాల నేతలు పాటుపడాలని కోరారు. గ్రామ సర్పంచి బడుగు బాలమ్మ, వామపక్ష నేతలు కొండా వీరాస్వామి, అనుమోలు వెంకటేశ్వరరావు, గండికోట దశరథరామయ్య, నక్కా రామారావు, తాడిశెట్టి శివయ్య, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నక్కా కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం ఏఎంసీ చైర్మన్‌గా శివశంకర్



హనుమాన్‌జంక్షన్ రూరల్: గన్నవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా హనుమాన్‌జంక్షన్‌కు చెందిన జనసేన పార్టీ నాయకుడు గరికపాటి శివశంకర్ నియమితులయ్యారు. కూటమి ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన నామినేటెడ్ పోస్టుల భర్తీ జాబితాలో గన్నవరం ఏఎంసీ చైర్మన్ పదవి జనసేనను వరించింది. గత కొంతకాలంగా ఆ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న గరికపాటి శివశంకర్ పేరు ఏఎంసీ చైర్మన్‌గా అనూహ్యంగా తెర మీదకు వచ్చింది. ఏఎంసీ చైర్మన్‌గా ప్రసాదంపాడుకు చెందిన టీడీపీ సీనియర్ నేత పేరును ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రతిపాదించినప్పటికీ, చివరి నిమషంలో శివశంకర్ పైచేయి సాధించడం విశేషం.

డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన



డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు: స్థానికంగా ప్రధాన డ్రెయినేజీ నిర్మాణానికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసాద్ మాట్లాడుతూ గ్రామంలో డ్రెయినేజీ లేక మురుగు నీటి సమస్య ఉందన్నారు. ఇది దృష్టిలో ఉంచుకొని పెనమలూరు జిల్లా పరిషత్ పాఠశాల నుంచి అంబేడ్కర్‌నగర్ వరకు రూ.50 లక్షలతో డ్రెయినేజీ నిర్మాణం చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బండి ప్రణవి, సర్పంచి లింగాల భాస్కరరావు, టీడీపీ నేతలు మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయా ఆనంద్‌ప్రసాద్, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం

తాడిగడప మున్సిపాలిటీ పరిధి పోరంకి గ్రామంలో వాటర్‌ప్లాంట్ రోడ్డును ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రారంభించారు. సుమారు రూ.40 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకర్‌బాబు పలువురు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు



పెనమలూరు మండల పరిషత్‌లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపీడీవో ప్రణవి

పెనమలూరు: వివిధ కార్పొరేషన్‌ల కింద లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయటానికి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. బీసీ, కమ్మ, కాపు, రెడ్డి పలు సామాజిక వర్గాల లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో 740 మంది దరఖాస్తు చేశారు. వీరిలో 571 మంది లబ్ధిదారులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఎంపీడీవో ప్రణవి మాట్లాడుతూ ఇంటర్వ్యూలలో అర్హులైన వారిని ఎంపిక చేసి వివరాలు ఆయా కార్పొరేషన్‌లకు పంపుతామన్నారు.

కంకిపాడు: వివిధ కార్పొరేషన్‌ల కింద సబ్సిడీ రుణాల జారీకి అర్హులైన దరఖాస్తుదారులకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బ్యాంకర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆయా కార్పొరేషన్‌ల కింద 84 యూనిట్లు మండలానికి కేటాయించగా 849 మంది రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వివిధ బ్యాంకులు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 711 మంది దరఖాస్తుదారులు హాజరయ్యారు. ఇంటర్వ్యూ ప్రక్రియను ఎంపీడీఓ పి.అనూష, మండల పరిషత్ ఏఓ ఎస్.బసవయ్య, బ్యాంకు అధికారులు పర్యవేక్షించారు.

విద్యార్థులు ఉద్యోగ ప్రదాతలుగా మారాలి



కానూరులో విద్యార్థులు ప్రదర్శించిన ఎక్స్‌పోను పరిశీలిస్తున్న శేఖర్‌బాబు

పెనమలూరు: విద్యార్థులు ఉత్తమ నైపుణ్యంతో ఎదిగి ఉద్యోగ ప్రదాతలుగా మారాలని బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పీఎస్.శేఖర్‌బాబు అన్నారు. కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఫ్రెష్‌మెన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయ్ విష్క్2కే25 ఎక్స్‌పోను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. విద్యార్థులు చదువుకునే సమయంలోనే పరిశ్రమలు నెలకొల్పటానికి కావల్సిన నైపుణ్యం సాధించాలన్నారు. విద్యార్థులు ఉద్యోగస్తులుగా కాకుండా ఉద్యోగ ప్రధాతలుగా ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన పలు ప్రాజెక్టులు పరిశీలించారు. అనాథ శరణాలయానికి రూ.24,800 విరాళం ఇచ్చారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, ది హిందూ రెసిడెంట్ ఎడిటర్ అప్పాజీ, రిసోర్స్ పర్సన్ కృష్ణజన్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్మాతకు పుష్పార్చన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నిర్వహిస్తున్న చైత్రమాస వసంత నవరాత్రోత్సవాలు ఆరో రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం దుర్గమ్మకు కాగడా మల్లెలు, మల్లెలు, జాజులు, మరువంతో ప్రత్యేక పుష్పార్చన చేశారు. తొలుత రాజగోపురం నుంచి అమ్మవారికి అర్చన నిర్వహించే పుష్పాలను ఆలయ అధికారులు, అర్చకులు, సేవా సిబ్బంది మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ప్రధాన ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. పూజా మండపంలో ఉత్సవ మూర్తికి పుష్పార్చన జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



గన్నవరం: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సివిల్ కోర్టు జడ్జి కె.జయలక్ష్మి సూచించారు. మండలంలోని దావాజిగూడెం బీసీ బాలికల హాస్టల్‌లో శుక్రవారం పోక్సో చట్టంపై న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ..బాలికల రక్షణను దృష్టిలో పెట్టుకుని పోక్సో చట్టాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. మైనర్ బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, లైంగిక వేధింపులకు పాల్పడినా ఈ చట్టం కింద కఠినంగా శిక్షించడం జరుగుతుందన్నారు. ఈ తరహ ఘటనలు ఎదురైనప్పుడు బాలికలు ధైర్యంగా ముందుకువచ్చి పోలీసులను, కోర్టులను ఆశ్రయించవచ్చని సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గారపాటి రవికుమార్, ఉపాధ్యక్షుడు ఎల్.వేణుబాబు, ప్రధాన కార్యదర్శి రామకూరి ప్రకాశరావు, కార్యనిర్వాహక సభ్యులు నల్లమోతు రమేష్, పి.శ్రీనివాస్, సీనియర్ న్యాయవాది ఎస్టీజీ.నీరజ, పలువురు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సిల్క్ ఎక్స్ పో ప్రారంభం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): బందరు రోడ్డులోని ఏ-కన్వెన్షన్ సెంటర్‌లో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్ కమ్ సేల్ శుక్రవారం ప్రారంభమైంది. నిర్వాహకులు మాట్లాడుతూ ఈ నెల 8 తేదీ వరకు కొనసాగే ప్రదర్శనలో ఎన్నో రకాల సిల్క్, కాటన్ డిజైన్ వస్త్రాలు ఉంచామన్నారు. బంధేజ్, హ్యాండ్-బ్లాక్ ప్రింట్లు చీరలు కూడా ఉన్నాయని చెప్పారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

పెనమలూరు: కానూరు సనత్‌నగర్‌లో కుటుంబ వివాదాల కారణంగా వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు సనత్‌నగర్‌కు చెందిన షేక్ మస్తాన్(40) కారు డ్రైవర్‌గా పని చేస్తాడు. అతనికి భార్య సంషాద్, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే గత కొద్ది రోజులుగా భార్యభర్తలకు మధ్య గొడవలు జరుగుతున్నాయి.

ఈ నేపథ్యంలో భార్యభర్తలకు ఈ నెల 2వ తేదీన గొడవ జరగటంతో భార్య ఇద్దరు పిల్లలతో చెక్‌పోస్టు వద్ద ఉన్న పుట్టింటికి వెళ్లింది. మస్తాన్ ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. కాగా మస్తాన్ మిత్రుడు చాంద్‌బాషా మస్తాన్ ఇంటికి 3వ తేదీ వచ్చి తలుపు కొట్టగా అతను తలుపు తీయలేదు. అనుమానం వచ్చి బలవంతంగా తలుపు తీయగా మస్తాన్ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉన్నాడు. దీంతో మస్తాన్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వటంతో వారి వచ్చి చూడగా అప్పటికే మస్తాన్ చనిపోయాడు. ఈ ఘటనపై మృతుడి బంధువులు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

● కల్యాణోత్సవానికి విగ్రహాలు సిద్ధం



కల్యాణోత్సవానికి సిద్ధమైన సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయస్వామి వార్ల విగ్రహాలు

సీతారాములోరి కల్యాణోత్సవానికి గ్రామాలు, పట్టణాలు ముస్తాబవుతున్నాయి. ఇందులో భాగంగానే చలువ పందిళ్లలో కొలువుదీర్చి పూజా కార్యక్రమాలు జరిపించేందుకు అవసరమైన సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయస్వామి విగ్రహాలను సిద్ధం చేసుకుంటున్నారు. దీంతో విజయవాడ పరిసరాల్లో బొమ్మల తయారీ కేంద్రాల వద్ద సీతారాముల విగ్రహాలను సిద్ధం చేస్తున్నారు. వివిధ వర్ణాల్లో చూడముచ్చటగా ఉన్న దేవతామూర్తుల ప్రతిమలను భక్తజనం తిలకిస్తున్నారు.

– కంకిపాడు

క్లుప్తంగా

పంట కాల్వలోకి మురుగు నీరు మళ్లింపు



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో డ్రెయినేజీ మురుగును గొల్లపూడి పంట కాల్వలోకి మళ్లించారు. గత మూడు రోజులుగా బోడపాడు, ఆపై ప్రాంతాల నుంచి వచ్చే డ్రెయినేజీకి పవర్‌గ్రిడ్ ఎదురుగా ఉన్న అపార్టుమెంట్లలో మురుగు, బాలాజీ అపార్టుమెంట్లలో డ్రెయినేజీ కాల్వ ద్వారా వచ్చే మురుగు మొత్తం గొల్లపూడి కాల్వలోకి మళ్లించారు. గ్రామంలో సగం డ్రెయినేజీ మొత్తం పంట కాల్వలోకి మళ్లించడంతో గ్రామంలోని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గొల్లపూడి ఎత్తిపోతల పథకం ద్వారా వచ్చే నీటిని డ్రెయినేజీ కాల్వను కలిపి కలుషితం చేస్తున్నారని, స్వర్ణాంధ్ర, స్వచ్ఛంధ్రా అంటే ఇదేనా అంటూ గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థను ప్రత్యేక కాల్వల ద్వారా బైటకు పంపే చర్యలను గ్రామ పంచాయతి చేపట్టాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

ఉద్యోగాలకు 13 మంది ఎంపిక



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన రామ్కీ టెడ్ కంపెనీ శనివారం క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించగా 13 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. కంపెనీ హెచ్ఆర్ వెంకటేశ్వర్లు ఇంజినీరింగ్ విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వివిధ పరీక్షల అనంతరం 13 మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నట్టు ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ ఎన్.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఎంపికైన కంపెనీలో ఉద్యోగాలను సమర్ధవంతంగా నిర్వహించి మంచిస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పిఎస్. శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు తమకు లభించిన అవకాశాలను ఉపయోగించుకోవాలన్నారు. ప్లేస్మెంట్ అధికారి జి.వడ్డికాసులు, సిబ్బంది, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



కంకిపాడు: అన్ని దానాల్లోకి అన్నదానం మిన్న అని వక్తలు పేర్కొన్నారు. లయన్స్ ప్రతినిధి బొట్ల వెంకట రమణారెడ్డి జయంతి సందర్భంగా ఆయన కుమార్తె సీహెచ్ గౌతమి లయన్స్ క్లబ్ ఆఫ్ కంకిపాడు ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం అన్నదానం నిర్వహించారు. 200 మంది పేదలకు అన్నదానం చేశారు. తొలుత లయన్స్ ప్రతినిధులు వెంకట రమణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు వన్నాల శివరామకృష్ణ, రీజనల్ చైర్‌పర్సన్ బండి జ్యోతి, మాజీ సర్పంచ్ బండి నాంచారయ్య, లయన్స్ ప్రతినిధులు మద్దుల గోవిందరావు, నీహార్, ఎం.యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి



కంకిపాడు: ప్రతి ఒక్కరూ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. రవూఫ్ బైక్ మెకానిక్స్ ఆధ్వర్యంలో గోసాల ప్రధాన సెంటరులో శుక్రవారం చలివేంద్రాన్ని దేవినేని రాజా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటుతో ప్రజల దాహార్తి తీరుతుందన్నారు. దాత షేక్ రవూఫ్, ప్రతినిధులు షేక్ షకార్, షేక్ సుబాని, రవి కిషోర్, ఎస్.మాధవరావు, ఈడే ఉదయ్‌బాబు, ఎండీ ఫిరోజ్, ఎస్.ఆంజనేయదాసు, దాసరి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

క్రెడాయ్ కార్యవర్గం ఎంపిక

లబ్బీపేట(విజయవాడతూర్పు): క్రెడాయ్ నగర శాఖ 2025–27 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. గురునానక్‌కాలనీలోని ఓ కల్యాణ మండపంలో చైర్మన్‌గా చెరుకూరి సతీష్, అధ్యక్షుడిగా జి.రామ్మోహనరావు, ఉపాధ్యక్షులుగా బి.పవన్‌కుమార్, కె.రమేష్ అంకినీడు, శివన్నారాయణ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కె.రఘురాం, జాయింట్ సెక్రటరీలుగా మండవ సుధాకర్, టి.నాగభూషణం, షమీఉద్దీన్ రజా, కోశాధికారిగా జి.సాయిరామ్‌ను ఎన్నుకున్నారు. పలువురిని కో ఆప్టెడ్ ఈసీ సభ్యులుగా ఎన్నుకున్నారు. బాధ్యతల స్వీకార కార్యక్రమంలో నాగమల్లేశ్వరరావు ఇన్‌స్టాలేషన్ అధికారిగా వ్యవహరించారు.